

పటిష్టంగా బాలల రక్షణ చట్టం అమలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో బాలల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 'బాలల హక్కుల రక్షణ చట్టం - మిషన్ వాత్సల్య' పై ముద్రించిన గోడపత్రికను శుక్రవారం కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్ లైన్ , మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలను అనుసంధానం చేశారని, ఈ సందర్భంగా బాలల రక్షణ చట్టం పటిష్టంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆపదలో ఉన్న బాలలు 1098 నెంబర్‌కు కాల్ చేసి సహాయం పొందొచ్చని, ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గోడపత్రికలను జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికి, అత్యాచారాలకు గురైన, వదిలివేయబడిన, ఆనాథలు, బడి మానివేసిన, బాల కార్మికులకు గుర్తించి వారిని సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

రహదారు(ణా)లు..!

గ్రామాల్లో ఆర్అండ్‌బి రోడ్లన్నీ అస్తవ్యస్తం
వేసవిలో ఇష్టానుసారంగా మట్టి తోలకాలతో పరిస్థితి అధ్వానం
బువ్వనపల్లి, అడవికొలను, నిడమర్రు రోడ్లు చూస్తే వణుకే
వర్షం పడితే మోటార్ బైక్ వెళ్లలేని దుస్థితి
ప్రతిపక్షంలో ఇదే రోడ్డు గురించి పాదయాత్ర చేసిన ఎంఎల్ఎ వాసుబాబు
నాలుగేళ్లయినా పట్టని వైనం
ప్రమాదకరంగా బుట్టాయగూడెం - జంగారెడ్డిగూడెం రోడ్డు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో ఆర్అండ్‌బి రహదారులు అత్యంత దారుణంగా తయారయ్యాయి. గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి అత్యంత దారుణం మారింది. అడుగుకో గొయ్యితో ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ తరుణంలో వేసవిలో చేపట్టిన మట్టితోలకాలతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వర్షం వస్తే చాలు జనం రోడ్డుపై వెళ్లాలంటేనే వణికిపోతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లయినా రోడ్ల గురించి పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో జనం నిత్యం నరకం అనుభవిస్తున్నారు. జగనన్న లే అవుట్ల పూడిక పేరుతో వేసవిలో ఇష్టానుసారంగా వైసిపి నాయకులు గ్రామాల్లో మట్టి తవ్వకాలు



అధ్వానంగా ఉన్న బువ్వనపల్లి, అడవికొలను ఆర్అండ్‌బి రోడ్డు

సాగించారు. వైసిపి నాయకులు అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు సాగించినా అడిగే నాథుడే లేకుండా పోయాడు. మట్టి తోలకాలతో రోడ్ల నిండ మట్టి చేరిపోయింది. వర్షం పడితే ఆ రోడ్లన్ని జారుడుబల్లల్లా తయారయ్యాయి. ఆర్అండ్‌బి రోడ్లా..మట్టి రోడ్లా అన్నట్లు పరిస్థితి తయారైంది. ఉంగుటూరు నియోజకవర్గంలో బువ్వనపల్లి నుంచి అడవికొలను, నిడమర్రు వెళ్లే రోడ్డు అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. వర్షం పడితే ఈ రోడ్డుపై ద్విచక్రం వాహనం వెళ్లలేని విధంగా తయారయ్యాయి. వర్షం పడినప్పుడు మోటార్ బైక్‌పై వెళుతూ జారిపడిపోతున్న ఘటనలు కోకొల్లలు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2019కు ముందు ఇదే రోడ్డు గురించి ప్రస్తుత ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పాదయాత్ర చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బువ్వనపల్లి, అడవికొలను రోడ్డు వేస్తామంటూ గ్రామస్తులకు హామీ సైతం ఇచ్చారు. వైసిపి అధికారంలోకొచ్చి నాలుగేళ్లు దాటినా ఇప్పటికీ ఈ రోడ్డుమాత్రం బాగుపడలేదు. అడవికొలను గ్రామానికి బంధువులు ఎవరైనా రావాలంటే రోడ్డు చూసి భయపడుతున్నారు. వర్షం పడినప్పుడు మట్టి రోడ్డుకంటే దారుణంగా ఉంటున్నాయి. నాయకులు మారినా రోడ్డు పరిస్థితి మారకపోవడంతో అడవికొలను గ్రామానికి చెందిన ప్రజలకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలీక తలలుపట్టుకుంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం కాకిలేరు గ్రామానికి వెళ్లే రోడ్డు సైతం మట్టి తవ్వకాలతో వర్షాలకు జారుడు బల్లలా తయారైంది. దీంతో రైతులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవే కాదు.. వేసవిలో ఇష్టానుసారంగా సాగించిన మట్టితవ్వకాలతో గ్రామాల్లోని ఆర్అండ్‌బి రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. ఏ ఒక్క అధికారిగానీ, ప్రజాప్రతినిధిగానీ రోడ్లగురించి నోరుమెదపడం లేదు. మండల కేంద్రం బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడేనికి వచ్చే రోడ్డుపై గోతులు చూస్తే నోరెళ్ల బెట్టాల్సిందే. ప్రధాన రహదారి సైతం అత్యంత దారుణంగా ఉంది. ఇక ఏజెన్సీ గ్రామాల్లోని రోడ్లన్నీ అత్యంత దారుణంగా తయారవడంతో జనం నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రోడ్ల గురించి ఆందోళనలు, పాదయాత్రలు చేసిన వైసిపి నాయకులు అధికారంలోకొచ్చాక పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజాప్రతినిధులపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి జిల్లాలో పవన్ వారాహి యాత్ర

తొలిరోజు ఏలూరులో భారీ ర్యాలీ, బహిరంగ సభ
రెండో రోజు నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు
తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, పాలకొల్లు మీదుగా సాగనున్న యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ వారాహి రెండో విడత యాత్ర ఈనెల తొమ్మిదో తేదీన ఏలూరులో ప్రారంభంకానుంది. తొలుత ఏలూరులోని క్రాంతి కల్యాణ మండపానికి పవన్ చేరుకోనున్నారు. అక్కడ నుంచి సత్రంపాడు వద్ద ఉన్న లోబ్రిడ్జి నుంచి సత్రంపాడు మీదుగా కొత్తబస్టాండ్, ఫైర్ స్టేషన్, శ్రీనివాస థియేటర్‌రోడ్డు, పవర్‌పేట స్టేషన్, కొత్తపేట, నూకాలమ్మగుడి, స్టేడియం రోడ్డు మీదుగా పాతబస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. తర్వాత రోజు పదోతేదీ క్రాంతి కల్యాణ మండపంలో వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల నాయకులతో మాట్లాడనున్నారు. 11వ తేదీన తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, పాలకొల్లు మీదుగా యాత్ర సాగనున్నట్లు జనసేన నాయకులు తెలిపారు. జనసేనాని ఏలూరు రానుండటంతో పట్టణమంతా పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలతో నిండిపోయింది. ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో జనసేన నాయకులు నిమగ్నమయ్యారు. పర్యటనకు సంబంధించిన వివరాలను ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు శుక్రవారం మీడియాకు వివరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున పవన్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు ఏలూరుకు తరలిరానున్నారు. దీంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో తొలివిడత యాత్రలో భాగంగా నరసాపురం, భీమవరంలో ఐదురోజుల పాటు పవన్‌కల్యాణ్ యాత్ర సాగింది. ఇప్పుడు అదే తరహాలో రెండోవిడత యాత్ర సాగనున్నట్లు తెలుస్తోంది.



ధర్నా చేస్తున్న మెడికల్ రిప్స్

కనీస వేతనాలు అమలు చేయాలని

మెడికల్ రిప్స్ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎన్.ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటీవ్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యూనియన్ కార్యదర్శి సిహెచ్.సీతయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మారంగంలో పనిచేస్తున్న మెడికల్ రిప్స్‌ను ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1976 సేల్స్ ప్రమోషన్ చట్టాన్ని ఫార్మా కంపెనీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ఫార్మా కంపెనీలు మెడికల్ రిప్స్‌కు మేడే సెలవును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. బీమా స్కీమును అమలు చేయాలని కోరారు. మహిళా రిప్స్‌కు వేతనంతో కూడిన మెటర్నటీ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని విమర్శించారు దీనివల్ల ప్రయివేటు కంపెనీలలో పని చేస్తున్న కోట్లాదిమంది కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ రిప్స్‌కు కొన్ని కంపెనీలు మేడే సెలవును వర్తింప చేయకపోవడాన్ని తప్పుబట్టారు. కార్మిక రంగంలో పిఎఫ్, ఇఎస్ఐ, తదితర వెల్ఫేర్ స్కీములను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఉమామహేష్, ఎ.సోమేశ్వరరావు, కె.శివ, గణేష్, రేవంత్, సుమంత్ పాల్గొన్నారు. ధర్నా అనంతరం లేబర్ అధికారులకు వినతిని అందించారు.


ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలి

ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం విరమించుకోవాలి
ప్రజారోగ్యం, పర్యావరణం, తాగునీటి చెరువులు, పంట భూములు, ఉపాధిని కాపాడాలి
విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కైకలూరు నియోజకవర్గంలో చెరువుల అక్రమ తవ్వకాలను తక్షణం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు సిపిఎం కార్యదర్శివర్గసభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పళ్లెం కిషోర్, జిల్లానాయకులు కె.శ్రీనివాస్, ఎం.మహంకాళి, చెరువు తవ్వకాల వ్యతిరేక పోరాట గ్రామాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. గురువారం కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లోని ఆక్వాచెరువుల అక్రమ తవ్వకాలు జరిగే గ్రామాలు, కైకలూరు మండలం నర్సాయపాలెంలో నిర్మిస్తున్న ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణ ప్రదేశాన్ని సిపిఎం జిల్లా బృందం పర్యటించింది. తాము పర్యటించిన గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఆక్వాపై వచ్చే ఆదాయానికి ఆశించి విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతులిస్తుందని రవి అన్నారు. మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో దళితపేటకు చేర్చి ప్రభుత్వ స్థలాలు, మాజీ ఆర్మీకి చెందిన భూముల్లో వైసిపి నేత చెరువులు తవ్విస్తున్నాడన్నారు. మురుగుబోదెను సైతం మూసివేశారని, కాలిబాటను సైతం ఆక్రమిస్తున్నారని తెలిపారు. కలిదిండి మండలం సీతారామపురం అగ్రహారంలో ఆరుగ్రామాలకు చెందిన మూడు వేలమందికి గాగునీటిని అందించే ఏడుఎకరాల మంచినీటిచెరువు ప్రక్కన 20 ఎకరాల్లో ఆక్వాచెరువులు తవ్వుతున్నారనీ ఆయన విమర్శించారు. కొండంగి గ్రామంలో ఎత్తిపోతల పథకానికి చెందిన మూడు ఎకరాల భూమి కబ్జాచేసి పెదలంక రోడ్డును నష్టపరిచేలా ఆక్వాచెరువులు తవ్వుతున్నారన్నారు. సొనారుద్రవరంలో దళితపేటలకు ఆనుకొని ఏడుఎకరాల్లో చెరువులు తవ్వుతున్నారనీ, ముదినేపల్లి మండలం దేవపూడి,ఊటుకూరు గ్రామాల్లో పంటచేలు,చెరువులకు ఆనుకుని అక్రమంగా ఆక్వాచెరువులు తవ్వుతున్నారనీ, ఇదేకాకుండా నియోజకవర్గమంతటా పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా చెరువుల తవ్వకాలు సాగుతున్నాయన్నారు. ఇప్పటికే వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోయి ఉపాధి కరువైందని, తాగునీరు కలుషితమై కిడ్నీలో రాళ్లు, కేన్సర్ వంటి రోగాలబారిన పడ్డామని, పొలాలు చౌడుబారిపోతున్నాయని, దీంతో వరిసాగు చేసే పేదరైతులు సాగుచేయలేక చేతులెత్తేసామని ప్రజలు వాపోతున్నారన్నారు. ఈ అక్రమ చెరువులు తవ్వితే తమకు తాగునీళ్లే కాదు, వాడకం నీళ్లు కూడా దక్కవని, ఊరంతా రోగాలబరిన పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తవ్విన ఆక్వా చెరువుల మురుగు పలుచోట్ల ఆర్అండ్‌బి రహదారుల పైకి వస్తోందని, వర్షాలు ఉధతమైతే ఇళ్లలోకి మురుగు వస్తుందని తమ పరిశీలనలో వెల్లడైందని చెప్పారు. ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా కైకలూరు మండలం పల్లెవాడ రెవెన్యూ పరిధిలోని నరసాయపాలెంలో నిర్మిస్తున్న ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం తక్షణం ఆపాలని, కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో తాగునీటి చెరువు, జగనన్న ఇళ్లకాలనీకి వెంబడి నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ప్రజారోగ్యానికి, పర్యావరణానికి చేటు కలిగిస్తుందన్నారు. ప్రజల ఆవాసాలకు దూరంగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ విషయమై ట్రైనీ కలెక్టర్ సమక్షంలో జరిగిన గ్రామసభలో ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారన్నారు. ప్లాంట్ వ్యర్థాలు, తాగునీటి చెరువులోకి, గ్రామాల్లో చేరి తమప్రాణాలకు హాని కలుగుతుందని వాపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు చెరువుల అక్రమతవ్వకాలు, ప్లాంట్ నిర్మాణానికి అనుమతులు లేవని ఒకసారి, తాము చేయగలిగింది లేదని, ఎంఎల్ఎతో మాట్లాడుకోవాలని, మరోసారి 2017, 2019 సంవత్సరాల్లో ఇచ్చిన అనుమతులతోనే వారు తవ్వకుంటున్నారని ఇంకోసారి రెండు నాలుకల వైఖరితో వ్యవహరిస్తున్నారన్నారు. కంచే చేను మేసినట్లు తాగునీటి చెరువులో పంట పొలాలు, ఆవాసాలకు చేర్చి ఆక్వా చెరువులు, ప్లాంటు నిర్మించకూడదన్న జిఒ 7, 14 ఇతర నిబంధనలను సైతం ఉల్లంఘిస్తున్నారన్నారు. ముదినేపల్లిలో తొలుత చెరువుల అక్రమ తవ్వకాలు అధికారులు అడ్డుకుని తర్వాత అనుమతులిచ్చేశారని, ప్లాంట్ నిర్మాణంలో మూడా, ఫ్యాక్టరీ కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ అధికారులు సైతం ముందు ఐదో కాంటూరులో ఉన్న దీనికి అనుమతి ఇవ్వబోమని చెబుతూనే ఇది ఐదోకాంటూలోకి రాదంటూ మాటమారుస్తున్నారన్నారు.

నిబంధనలు పాటించకుండా చెరువులు తవ్వుతున్న యజమానులపై కాకుండా స్థానికప్రజలను పోలీసులు బెదిరిస్తున్నారని, కానుకొల్లులో 50 మంది పోలీసులను మోహరించారని, గ్రామంలో యువకులను కొద్ది గంటలపాటు స్టేషన్లో నిర్బంధించి, బీతావాహం సృష్టించారని తెలిపారు. కైకలూరు ఎంఎల్ఎ డి.నాగేశ్వరరావు అండతోనే తవ్వకాలు, ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం సాగుతున్నాయన్నారు. ఆయన, ఆయన అనుచరులు యజమానుల నుండి రూ.లక్షల్లో లంచాలు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలకు అధికారులను అడ్డురానీయకుండా చూస్తున్నారనే ఆరోపణలు అన్నిచోట్లా వచ్చాయని, పైగా ఈ ప్రజలతో తనకు ఆక్వారైతుల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. ప్రజలపై పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని పోలీసుల అనుచితజోక్యం,నిర్బంధం ఆపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రజలపక్షాన ఉంటారో పెత్తందారుల పక్షాన ఉంటారో తేల్చుకోవాలన్నారు. రాష్ట్రప్రభుత్వం వైఖరి మార్చుకోకుంటే ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్థాయిలో జరుగుతున్న ఉద్యమాన్ని జిల్లావ్యాప్తఉద్యమంగా విస్తరిస్తామని, అందుకు తగిన కార్యాచరణ కూడా రూపొందిస్తామని హెచ్చరించారు.



యాజమాన్యం, కార్మిక సంఘాలతో సమీక్షిస్తున్న కలెక్టర్

జ్యూట్ కార్మికులకు పరిహారం చెల్లించాలి

యాజమాన్యానికి కలెక్టర్ ఆదేశం


ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని శ్రీకృష్ణ జ్యూట్ మిల్లును మూసివేసిన కారణంగా కార్మికులకు చట్టపరంగా అందించాల్సిన నష్టపరిహారమివ్వాలని యాజమాన్యాన్ని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం శ్రీకృష్ణ జ్యూట్ మిల్ యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులతో కార్మికులకు చెల్లించాల్సిన నష్టపరిహారం అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికశాఖ సంయుక్త కమిషనర్, కార్మిక సంఘాల నాయకులతో గతనెల 22వ తేదీన కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి కార్మికులకు నష్ట పరిహారం అందించాలన్నారు. మిల్లులో ఉద్యోగం కోల్పోయిన వారిలో ఆసక్తి ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తామని, వారికి కొత్తూరు జ్యూట్ మిల్లులో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యాజమాన్యాన్ని కలెక్టర్ కోరారు. కార్మిక శాఖ ఉపకమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గతనెల ఒకటో తేదీ నాటికి కంపెనీ మాస్టరు రోల్స్‌లో ఉన్న కార్మికులకు ఈ ఒప్పందం వర్తిస్తుందని, పర్మినెంట్, రెజోయిన్డ్ కార్మికులకు చెల్లించాల్సిన పిఎఫ్, గ్రాడ్యుటీలతో పాటు మూడున్నర నెలల జీతం (ఫిబ్రవరి, 2022 చెల్లించిన జీతంతో కలుపుకుని), ఏడాదికి రూ.మూడు వేలు చొప్పున పనిచేసిన కాలానికి సర్వీస్ కాంపెన్సేషన్‌గా చెల్లించాలన్నారు. బదిలీ కార్మికులకు వీటిలో 50 శాతం చెల్లించాలన్నారు. వీటితో పాటు మరికొన్ని అంశాలపై అంగీకారం కుదిరిందని, వీటిని అంగీకారం కుదిరిన తేదీ నుండి కార్మికులకు రెండు నెలల్లోగా కార్మికులకు నగదు చెల్లించేందుకు సమయం ఇచ్చారన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్ శివశంకర్ లునాని, మేనేజర్ ఎన్ఎ.సురేష్, హరి, కార్మిక సంఘాల నాయకులు పులి శ్రీరాములు, పాలడుగు మురళీశ్యాం, కొలపల్లి ఉమా శంకర్, బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

10 నుంచి అంగన్‌వాడీల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో 36 గంటలు కలెక్టరేట్ కార్యాలయాలు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం టీచర్స్ అసోసియేషన్ హాలులో జరిగింది. ముఖ్యఅతిథిగా ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భారతి విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, తెలంగాణ కన్న అదనంగా వేతనాలివ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయసు 50 సంవత్సరాలు పెంచాలని కోరారు. రాజకీయ జోక్యం అరికట్టాలని, ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలన్నారు. పిల్లలకు అమ్మ ఒడి, యూనిఫారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఫుడ్ ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బీమా అమలు చేయాలని కోరారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి జరిగే 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు పిఎల్ఎస్.కుమారి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అఖిలభారత కోర్కెల దినం సందర్భంగా 10న బ్లాక్ డే నిర్వహించాలని అఖిల భారత కమిటీ నిర్ణయించిందని, ఈ మేరకు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో తట్టవర్తి మైత్రి, ఎం.శివరత్నకుమారి, వి.లక్ష్మి, ఎన్.దేవి, కె.రాణి, రాజామణి, కె.గంగారత్నం, పద్మజ, కె.వెంకటలక్ష్మి, శారద, నూర్జహాన్, వి.రాజ్యలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.



భీమడోలులో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో అంగన్‌వాడీలు, నాయకులు

భీమడోలు: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 10, 11వ తేదీల్లో 36 గంటల పాటు ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు యూనిట్ నాయకురాలు రాజామణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా లింగరాజు మాట్లాడారు. అనంతరం ధర్నా గోడ పత్రికలను అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు వై.సాల్మన్ రాజు, స్వర్ణకుమారి, కనకదుర్గ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం : జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - పెదపాడు

నిరుపేదల కళ్లల్లో సంతోషం చూడడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను సిఎం జగన్ అమలు చేస్తున్నారని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని వట్లూరు పంచాయతీ సీతారామపురంలోని మూడో నెంబర్ గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ధృవపత్రాలను చైర్‌పర్సన్ అందించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ పేదల కళ్లల్లో ఆనందం చూడటమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నూరుశాతం మందికి అందాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అర్హత ఉండీ నిర్దేశించిన ధృవీకరణ పత్రాలు లేని కారణంగా కొంతమంది సంక్షేమ కార్యక్రమాలు పొందలేకపోతున్నారన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ మిగిలిపోకూడదన్న ఉద్దేశ్యంతో ధృవీకరణ పత్రాలను లబ్ధిదారుల ఇంటికే ఉచితంగా అందించేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించడమే 'జగనన్న సురక్ష' కార్యక్రమం లక్ష్యమన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వహయాంలో ప్రభుత్వ పాఠశాలలు ఎలాంటి అభివృద్ధి లేక శిథిలావస్థకు చేరుకున్నాయని, సమాజంలో విద్య ఆవశ్యకత, విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకున్న సిఎం విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టి కార్పొరేట్ స్థాయికి ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారన్నారు. వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు మాట్లాడుతూ 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ప్రజలకు రూపాయి ఖర్చులేకుండా అన్ని రకాల ధృవీకరణ పత్రాలను ప్రభుత్వం ప్రజల ఇంటివద్దకు అందిస్తుందన్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరి మాట్లాడుతూ వట్లూరు గ్రామ పంచాయతీలో ప్రభుత్వం కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ పక్కా గృహాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కెపి.చంద్రశేఖర్, తహశీల్దార్ విజయకుమార్ రాజు, ఎంపిడిఒ ఎస్.నిర్మలజ్యోతి, మండల అధ్యక్షురాలు బత్తుల రత్నకుమారి, సర్పంచి జి.రత్నకుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు అప్పన ప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ గోపి ప్రసంగించారు. అనంతరం ధృవీకరణ పత్రాలను పద్మశ్రీ అందించారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు.



ధృవీకరణ పత్రాలు అందిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

పోలవరం సీటు శ్రీనివాస్‌కు కేటాయించడం పట్ల హర్షం

పోలవరం: పోలవరం నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ సీటు పోలవరం గ్రామానికి చెందిన బొరగం శ్రీనివాస్‌కి కేటాయించడం పట్ల టిడిపి మండల నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలవరం మండల కేంద్రంలో టిడిపి కార్యాలయం నుండి స్థానిక ఏటిగట్టు సెంటర్ వరకూ జెండాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, ఎస్.సుధీర్, మాజీ ఉపసర్పంచి మంగిన కొండ మాట్లాడుతూ కీర్తిశేషులు మాజీ ఎంఎల్ఎ పూనెం సింగన్న దొర తర్వాత పోలవరం మండలంలో ఎంఎల్ఎ సీటు రావడం ఇదే ప్రథమమన్నారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ సమీక్ష సమావేశంలో చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పోతుల శ్రీనివాసరావు, జల్లేపల్లి జితేంద్ర పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు కోరుతూ నేడు ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల ఎనిమిదో తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించే ప్రతిఘటన ధర్నాలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని యూటిఎఫ్ రాష్ట్ర నాయకులు పురేటి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిఘటన ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట నెరవేర్చుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పూర్తి వ్యతిరేకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు రవికుమార్ పిఆర్‌టియు నాయకులు సంపత్, డిటియఫ్ నాయకులు మణికిశోర్, సిపియస్ ఇఎ డివిజన్ కన్వీనర్ కంచర్ల బుచ్చిబాబు, యూటియఫ్ మండల అధ్యక్షులు దామోదర్, ప్రేమ్ కుమార్, బాలకష్ణ, విజయానంద్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో నేటి నుంచి పాదయాత్ర

ప్రజాశక్తి - చింతలపూడి

బోయగూడెం నుంచి సీతానగరం వరకూ "పోరు బాట" పేరుతో మహా భారీ పాదయాత్ర చేసి సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. బోయగూడెం వయా సీతానగరం రోడ్డును గత 20 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకోకపోవటంతో శనివారం ఉదయం 7:30 నుంచి పాదయాత్ర చేపట్టిన్నట్లు తెలిపారు. చింతలపూడి, శెట్టివారిగూడెం, నామవారం, పట్టయిగూడెం అగ్రహారం గ్రామ ప్రజలందరూ పాదయాత్రలో పాల్గోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలం జనసేన అధ్యక్షులు చీదరాల మధుబాబు పాల్గొన్నారు.

'ఎబిసిడి వర్గీకరణ సాధిస్తాం'

ప్రజాశక్తి - చాట్రాయి

ఎబిసిడి వర్గీకరణ సాధించడం కోసం అనేక కష్టనష్టాలను, ప్రాణ త్యాగాలను చేసి సాధించామని ఎంఆర్‌పిఎస్ మండల కార్యదర్శి, మాజీ సర్పంచి గార్లపాటి మారేష్ అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 29 వ ఆవిర్భావ దినోత్సవం చాట్రాయిలో శుక్రవారం నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు మొలుగుమాటి రవిరామ్ ఎంఆర్‌పిఎస్ జెండాను పెద్ద దళితవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గార్లపాటి మారేష్ మాట్లాడుతూ ఎబిసిడి వర్గీకరణ సాధించడం కోసం అనేక కష్టనష్టాలను, ప్రాణ త్యాగాలను చేసి సాధించామని తెలిపారు. 1994 జూలై 7 వ తేదీన ఎంఆర్‌పిఎస్ ఉద్యమం ప్రకాశం జిల్లా ఈదిమూడి గ్రామంలో 20 మంది కార్యకర్తలతో నిర్వహించారన్నారు. మాన్యశ్రీ మందా కష్ణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంట్లో ఆమోదం లేదనే సాంకేతిక లోపం వల్ల ఎబిసిడి వర్గీకరణను రద్దు చేశారని, తిరిగి ఎబిసిడి వర్గీకరణ కోసం అనేక పోరాటాలు చేసున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి గ్రామ మాజీ సర్పంచి కోట.జోషి, చిన్నంపేట గ్రామ మాజీ ఎంపిటిసి కలపాల రమేష్, మాజీ మండల అధ్యక్షుడు లాజర్ పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

పాత చింతలపూడి సంచివాలయం పరిధిలో గత ఏడాది గడపగడపకూ మనప్రభుత్వంలో ఇచ్చిన హామీలు నేటి వరకూ అమలు కాలేదని సిపిఐ నాయకులు బాబు, వజ్రం ఎంఎల్ఎకు శుక్రవారం వినతిని అందజేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, మంచినిటి ట్యాంక్, చేతి బోరు పంపు, సిసిరోడ్లు, డ్రైయినేజి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇళ్లు కట్టుకున్న వారికి బిల్లులు పడటం లేదని, నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ మంచినీటి ట్యాంక్, చేతి బోరు పంపు వేయిస్తామని, సిసి రోడ్లకు కొంత సమయం కావాలని తెలిపారు.

సౌకర్యాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

వసతి గృహాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని విద్యలో రాణించాలని బిసి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. మూడో తరగతి నుంచి పదవ తరగతి చదువుకునే విద్యార్థులు హాస్టల్ వసతిని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. హాస్టల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని అన్నారు. వసతి గహాల నందు నోట్ పుస్తకాలు, దుప్పట్లు ఉచితంగా అందిస్తున్నామని కాస్మోటిక్ సంబంధించిన చార్జీలు బాలుర అకౌంటులోకి జమవుతాయని అన్నారు. ట్యూషన్‌తో పాటు పోష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు.

ఘనంగా నాగరాజు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కైకలూరు

జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సర్పంచి నాగరాజు గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగినేని వరప్రసాద్ బిసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగినేని మాట్లాడుతూ నాగరాజు సేవలను కొనియాడారు. చిన్న వయసులోనే పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకి దగ్గరగా మమేకమై ఆచవారం సర్పంచిగా గట్టి పోటీని ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నిక కావడం గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గంగుల అశోక్, కైకలూరు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి భలే వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దిరాల సంజీవరావు, బీసీ నాయకులు బోళ్ళ శ్యామల రాజు, రవి వర్మ ఆచవరం ఎంపీటీసీ సభ్యులు బుర్ల నాగరాజు, ఎం రవి కిరణ్ మత్తె రవికుమార్ ఏ కుల వేణుగోపాలస్వామి నారగాని శ్రీనివాసరావు షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - మండవల్లి

ఖాళీగా ఉన్న అంగన్‌వాడి ఆయా పోస్ట్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సిడిపిఒ ఆనంద్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసి కాలనీలోని రెండవ అంగన్‌వాడి కేంద్రంలో ఆయా పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. ఈ పోస్టుకు 21 నుంచి 35 సంవత్సరాలు లోపు వయస్సు కలిగిన వివాహితులు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. స్థానికులై ఉండాలని స్పష్టం చేశారు. ఈ పోస్టుకు విద్యార్హత 10వ తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తుకు విద్య, కుల, నివాస, ఆధార్ ధృవీకరించు జిరాక్స్ కాపీలతో గెజిటెడ్ సంతకం చేయించుకొని పాస్‌పోర్ట్ సైజు రెండు ఫోటోలతో రెండు సెట్లు జత పరచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తుదారులు జూలై 15, సాయంత్రం ఐదు గంటలు లోపు చేసుకోవాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి - పోలవరం

గ్రామానికి చెందిన అక్కాబత్తుల లక్ష్మణరావు(27) అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం కొవ్వూరు మండలం ఆరికరేవు రోడ్డు ప్రమాదంలో మతి చెందాడు. పోలవరం యడ్లగూడేనికి చెందిన లక్ష్మణరావు స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద మీ షో కొరియర్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. తన వ్యక్తిగత పనుల నిమిత్తం బుల్లెట్‌పై వెళుతుండగా కొవ్వూరు మండలం ఆరికరేవులలో చాగల్లు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అక్కడికక్కడే మతి చెందాడు. మతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలవరం తరలించారు. అందరితో ఆప్యాయంగా మాట్లాడుతూ స్నేహ పూర్వకంగా వ్యవహరించే లక్ష్మణ్ రావు మతి చెందడంతో యడ్లగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబంలో అతనే ప్రధాన సంపాదనదారుడు కావడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం తాటి యాకుల గూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు దాడులు చేయగా పలువురు పారిపోగ గ్రామానికి చెందిన ఉలవల.సత్యనారాయణ, కాసిని.వెంకన్నను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,130 నగదును స్వాధీనం చేసుకొని, 52 పేక ముక్కలు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

మా ఊరికి రోడ్డేయరూ..!



గోతులతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - చితలపూడి

ఆ ఊరికి రోడ్డు లేదు, బస్సు సౌకర్యం లేదు, అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం వెళ్లటం లేదంటే ఆలోచించాల్సిన పరిస్థితి. కళాశాలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులూ తప్పటం లేదు.. 15 సంవత్సరాలుగా మా ఊరికి రోడ్డు వేయండి అంటూ గ్రామస్తులు అడగని అధికారులు లేరు. ప్రజాప్రతినిధులు లేరంటే అతియోశక్తి లేదు. స్పందనలో ఫిర్యాదులు, ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చినా కనీసం తూడుపు చర్యలు లేవంటే లేవు.. ఇది సీతానగరం - నామవరం రోడ్డు పరిస్థితి..ఎన్నికల ముందు ఏ పార్టీ అయినా మొదటి ఇచ్చే హామి సీతానగరం - నామవరం రోడ్డు వేయిస్తామని.. అధికారంలోకి వచ్చాక కనీసం ఆ గ్రామల్లో పర్యటన కూడా చేయలేని పరిస్థితి. గత టిడిపి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులను గ్రామస్తులు గట్టిగా నిలదీశారు.. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఆ రోడ్డు వెంబడి గ్రామల్లో కనీసం ఒక్క కార్యక్రమం ఇప్పటి వరకూ జరగలేని పరిస్థితి నెలకోంది.

శెట్టివారి గూడెం, సుబ్బారాయుడు గూడెం, నామవరం, పట్టాయిగూడెం, సీతానగరం ఈ రోడ్డు వెంబడి గ్రామాలు 5, పంచాయతీలు 3, దాదాపు 6,700 ఓటింగ్, 10 వేల జనాభా ఉన్నారు. ఏ చిన్న పని నిమిత్తమైనా చింతలపూడికి రావలస్సిందే, మూడు పంచాయతీలు, 5 గ్రామాలు 1993లో రోడ్డు నిర్మాణం చేపట్టారు. 1995 రోడ్డు మరమ్మతులకు వచ్చింది. అప్పటి నుంచి నేటి వరకూ రోడ్డు వేయించే నాథుడే లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డు వెంబడి బస్సు ఆఖరిగా 2004 సంవత్సరంలో చూశారంటే అర్థం చేసుకొవచ్చు... ఆ గ్రామ ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారోనని!

గ్రామాలలో మంచినిటి సౌక్యరం కావలన్నా, సమస్యలు ఎవరికైనా చేప్పుకోవాలన్నా చింతలపూడికి రావాల్సిన పరిస్థితి. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా నిర్వహించకపోవటంతో, సమస్యలు కూడా చేప్పుకోవటానికి అవకాశం లేకపోవటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేసి వారి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

హామీలు తప్ప అమలు లేదు

సిహెచ్.మధు, జనసేన నేత, చింతలపూడి



చింతలపూడి మండలంలో బోయగూడెం - వయా - సీతానగరం రోడ్డు ఏ ప్రభుత్వం వచ్చినా వేయిస్తామని హామీలు ఇవ్వటం తప్ప అవి నెరవేర్చే నాథుడే లేడు. త్వరలో దీనిపై కార్యాచరణ చేసి పోరాటం చేస్తాం.

108 సౌకర్యం కూడా లేదు

జరబాల అశోక్,




దాదాపు ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేక, సరైనా సౌకర్యాలు లేక, నానా ఇబ్బందులు పడుతున్నాం. బస్సు, 108 సౌకర్యం కూడా లేదు. మా సమస్య ఎవరికి పట్టటం లేదు.

గ్రామసభకు నిరసన సెగ

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజల సమస్యలు పరిష్కరించేలా గ్రామసభకు అధికారులను హాజరు పరచలేనప్పుడు ప్రయోజనం లేదని సర్పంచిని, కార్యదర్శిని గ్రామస్తులు నిలదీశారు. స్థానిక నాగేంద్ర స్వామి వారి దేవస్థానంలో సర్పంచి మెండ జాన్సీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గ్రామసభ అధికారులు లేకపోవడంతో వివాదాస్పదమైంది. గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకుని సమస్యలపై నిలదీయడంతో గ్రామ సభకు మరోమారు నిరసన సెగ తగిలింది. పిహెచ్‌సిలో వైద్య సేవలు అందడం లేదని, వైద్య సేవలు అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రోగులు ఆరోగ్య కేంద్రానికి వెళ్లకపోవడంతో వారి సంఖ్య తగ్గిందని రూ.లక్షల జీతాలు తీసుకుంటూ.. వైద్యం అందించకపోతే మీరెందుకని గ్రామస్తులు వైద్యులను ప్రశ్నించారు. గత 17 ఏళ్లుగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను మెరక చేస్తామంటూ నేటికి చేయించకపోవడంపై లబ్ధిదారులు కార్యదర్శిని నిలదీశారు. దళితులకు చెందిన శ్మశానానికి కంచ వెయ్యాలని, శ్మశానంలో దట్టంగా పేరుకుపోయిన పిచ్చి మొక్కులను తొలగించాలని తెలిపారు. దళిత మహిళలు బట్టలు ఉతుక్కునేందుకు వేరే గ్రామం వెళ్లాల్సి వస్తుందని, రేవును కట్టించాలని కోరారు. దళిత వాడలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదని, డ్రైయినేజీ లేకపోవడంతో వర్షాకాలంలో సిమెంటు రోడ్లన్నీ మురుగు మయ మవుతున్నాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని సంవత్సరాల తరబడి అర్జీలు దాఖలు చేస్తున్నా ఎందుకు పట్టించుకోలేదని అధికారులపై ధ్వజమెత్తారు. విస్తరణ పనుల వల్ల జాతీయ రహదారిని ఇష్టానుసారంగా తవ్వి వదిలి వేయడం వల్ల డ్రైయినేజీ పారేందుకు అవకాశం లేక వేలంపేట రామాలయానికి వెళ్లే అంతర్గత రహదారి పైకి మురుగు చేరుకుని దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. కైకలూరు సందు నిత్యం మురుగునీటిలో తాండవిస్తుందని తెలిపారు. పందులు, కుక్కలు సైర్య విహారం చేస్తూ గాయపరుస్తున్నా పట్టించుకోవడం లేదని సర్పంచిని ప్రశ్నించారు. పంచాయతీకి ఆదాయం సమకూర్చే పంచాయతీ షాపులకు, కొబ్బరి చెట్లకు, సొంత పాట చెరువుల వేలంకు కాలపరిమితి అయిపోయిన తిరిగి ఎందుకు పాట పెట్టలేదని, దీంతో రెండు సంవత్సరాలుగా పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడిందని అన్నారు.



గ్రామసభలో గ్రామస్తుల ఆగ్రహం

ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. దీంతో స్పందించిన కార్యదర్శి మాట్లాడుతూ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. అర్థాంతరంగా గ్రామసభను ముగించేశారు. ఈ కార్యక్రమంలో సొసైటి అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరావు, కార్యదర్శి టి.శ్రీనివాసరావు, టి.అప్పారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రతిఒక్కరికీ లబ్ధి



భీమడోలులో..

ప్రజాశక్తి - చింతలపూడి

నిరుపేదల కళ్లల్లో సంతోషం చూడడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను సిఎం జగన్ అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. పాత చింతలపూడి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ధృవీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడి కళ్లలో ఆనందాన్ని చూడడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నూరుశాతం మంది ప్రజలకు అందాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అర్హత ఉండి నిర్దేశించిన ధృవీకరణ పత్రాలు లేని కారణంగా కొంతమంది ప్రజలు సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. జగనన్న సురక్షలో అటువంటి వారిని గుర్తించి వారికి ఉచితంగా పత్రాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాబత్తుల శ్రీను, మిర్యాల దిలీఫ్, కాంతారావు, వెంపాకృష్ణ, దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించడమే 'జగనన్న సురక్ష' కార్యక్రమ లక్ష్యమని చింతలపూడి ఎయంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. యర్రగుంటపల్లిలో జగనన్నా సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ, సుధాకర్ పాల్గొన్నారు.




జీలుగుమిల్లిలో...

జీలుగుమిల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి పివిఎస్ నాయుడు తెలిపారు. కామయ్య పాలెం సచివాలయం పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమమే జగనన్న సురక్ష లక్ష్యమని అన్నారు. పంచాయతి పరిధిలో 80 శాతం వరకూ సర్వే పూరైందన్నారు. గ్రామంలో మొత్తం 224 సర్టిఫికెట్‌లు అందచేశారు. అనంతరం పంచాయతి పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంత రావు, తాహశీల్దార్ సుందర్ సింగ్, ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, సర్పంచి బోగేశ్వరరావు పాల్గొన్నారు.

భీమడోలు: సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేకించిన జగనన్న సురక్ష శిబిరం సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు కోరారు. పూళ్ళ గ్రామ సచివాలయం - 1 పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి గ్రామ సర్పంచి సుజాత ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ 799 దరఖాస్తులు రాగా వీటిలో 775 మంది దరఖాస్తుదారులకు టోకెన్లను అందజేశామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎంఎల్ఎ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అంద జేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మండవల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరీక్షించే విధంగా జగనన్న సురక్ష పథకాన్ని తీసుకొచ్చారని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు తెలిపారు. కానుకొల్లులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. అనంతరం మొక్కలు నాటి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ, సర్పంచి నాగదాసి థామస్, జడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయనిర్మల, ఎంపిటిసి సభ్యురాలు పుట్టి మీనా కుమారి, పొట్టి సత్యనారాయణ, దర్శకత్ల స్వామి, తాహశీల్దార్ రాజకుమార్, ఎంపిడిఒ రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ముసునూరులో...

కైకలూరు: జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షతో ప్రజా సమస్యలు వెంటనే పరిష్కారం అవుతున్నాయని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని బుజబలపట్నంలో జగనన్న సురక్షలో ఆయన ఎంఎల్సి జయమంగళ వెంకటరమణతో కలిసి పాల్గొన్నారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్స్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్, మండల వ్యవసాయ మార్కెట్ అధ్యక్షురాలు దండే పుష్పలత, సర్పంచి గురజాల రామ తులసి, ఎంపిటిసి పెన్మెత్స సూర్యనారాయణ రాజు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యామ్ సుందర రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలవరం: జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా అర్జీదారులకు మెరుగైన సేవలు అందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఐటిడిఎ పిఒ ప్రత్యేక అధికారి జీవివి సత్యనారాయణ అన్నారు. కొత్త పట్టిసీమ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఐటిడిఎ పిఒ అధ్యక్షతన సర్పంచి మైగాపుల విజయ దుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కలుం హేమ కుమారి, తాహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి.శ్రీను, ఎంపిటిసి వలవల వరలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు బుగ్గ మురళి కష్ణ పాల్గొని ప్రజల సమస్యలను తెలుసున్నారు. ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నూరుశాతం మంది ప్రజలకు అందాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అర్హత ఉండి నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా కొంతమంది ప్రజలు సంక్షేమ కార్యక్రమాలు పొందలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ తాతి విజయ కుమారి, ఎపిఒ వెంకటరమణ, వ్యవసాయ అధికారి రాంబాబు, వైసిపి నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామసమస్యలు పరిష్కరించడం ఆనందంగా ఉందని జడ్‌పిటిసి సభ్యులు డాక్టరేట్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు తెలిపారు. శుక్రవారం మండలంలోని చింతలవల్లి గ్రామంలో ఎంపిడిఒ జి.రాణి, సర్పంచి పిల్లి సత్యనారాయ ణల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల కృష్ణ కుమారి సుబ్బారావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన పాల్గొన్నారు.



పోలవరంలో...



యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

యాజమాన్య పద్ధతులతో చీడపీడల నివారణ

భీమడోలు: రైతులు వరి సాగులో మేలైన నారుమడి యాజమాన్య విధానాలను అమలు చేయడం ద్వారా పైరుకు చీడ పీడల నుంచి రక్షణ కల్పించవచ్చని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి తెలిపారు. వ్యవసాయాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేలైన వ్యవసాయ పద్ధతుల అమలు చేసే పొలంబడి క్షేత్రాన్ని సహాయ సంచాలకులు శుక్రవారం సందర్శించారు. కార్యక్రమంలో ఏలూరు రైతు శిక్షణా కేంద్రంకు చెందిన సహాయ సంచాలకులు శిరీష, సుధ పాల్గొన్నారు. అనంతరం కొనసాగిన పొలంబడి కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారుమడి వేయడానికి ముందు వరి విత్తనాలను సూడో మోనస్‌తో శుద్ధి చేయాలని సూచించారు. ఒకవేళ అది సాధ్యం కాకుంటే నాటడానికి వినియోగించే నారు కట్టలను ముందుగా సూడోమోనస్ ద్రావణంలో ముంచి ఆ తర్వాత చదరపు మీటర్లకు 33 మెనల వంతున నాటాలని కోరారు. అనంతరం రైతులకు కంది విత్తనాలను, సూడోమోనస్ మందును వ్యవసాయ శాఖ తరపున పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ భీమడోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలి

జీలుగుమిల్లి :రీ సర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్‌డిఒ ఎం.జాన్సీ రాణి తెలిపారు. శుక్రవారం జీలుగుమిల్లి తహశీల్దార్ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్‌లతో నిర్వహించిన రీ సర్వే సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రీ సర్వే పనుల వివరాలను తహశీల్దార్ సుందర్ సింగ్‌ను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం సర్వేయర్‌లు విధుల్లో సక్రమంగా పని చేయాలని సూచించారు. భూ సర్వే చేసేటప్పుడు రికార్డ్‌ను బట్టి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణ, విఆర్‌ఒలు తులసి, తిరుపతమ్మ, మాధురి, అటెండర్ శాంతి, విఆర్ఎ షరీఫ్, రవితేజ పాల్గొన్నారు.